
జాతీయ తెలుగు దినపత్రిక

# ప్రజా జ్యోతి

ప్రతిఅక్షరం - ప్రజల కోసం

ఖమ్మం

గురువారం 16 జనవరి 2025

## మీ ఆవేదన.. ఆక్రోశం దేని కోసం



- తన రాజకీయ జీవితం గురించి మీరు చేసిన వ్యాఖ్యలు తీవ్ర అభ్యంతరకరం...
- ఆక్షేపణీయంగా ఉన్నాయంటూ ఎంపీ దర్మపురి అరవింద్‌కు తెలియజేశారు.
- 1983 నుంచి నేటి వరకు తన రాజకీయ జీవితం తెరచిన పుస్తకం
- పదవుల కోసం, పార్టీ టికెట్ల కోసం ఏ నాడు, ఏ నాయకుడి వద్ద తాను మోకరిల్లింది లేదు...
- ఏ హెూదాలో విధులు నిర్వర్తించినా రాష్ట్ర అభివృద్ధి, రైతులు సంక్షేమం, పేదల పక్షపాతం తప్ప తనకు మరో ఎజెండా అయితే లేదు
- తెలంగాణ వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

వివరాలు లోపలిపేజీలో..

### నాలుగు సంక్షేమ పథకాల సర్వే ప్రక్రియ

# పారదర్శకంగా పూర్తి చేయాలి

### జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్

### లబ్ధిదారుల ఎంపిక అనేది నిరంతర ప్రక్రియ

### అర్హులందరికి ప్రభుత్వ ఫలాలు అందాలి

### 4 క్రొత్త పథకాల అమలుపై అధికారులతో సమీక్షించిన జిల్లా కలెక్టర్



రాష్ట్ర ప్రభుత్వం జనవరి 26 నుండి అమలుచేయనున్న 4 సంక్షేమ పథకాల క్షేత్ర స్థాయి సర్వే ప్రక్రియ పారదర్శకంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ తెలిపారు. బుధవారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో ప్రభుత్వం అమలు చేయనున్న 4 పథకాలపై స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డా. పి. శ్రీజ తో కలిసి సమీక్షించారు

వివరాలు లోపలిపేజీలో..

# జమిందార్లకు ఎదురు నిలిచిన నేత సామ్యానాయక్



సింగరేణి మండల పరిధిలోని ఉసిరికాయలపల్లి ప్రాంతంలో జమిందార్లుకు ఎదురునిలిచిన నేత వాంకుడోత్ సామ్యానాయక్ అని సీపీఐ(ఎం) రాష్ట్ర నాయకులు పీ.సోమయ్య, జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావులు అన్నారు.సింగరేణి మండలం సామ్యాతండాకు చెందిన సీపీఐ(ఎం) సీనియర్ నాయకులు, మాణిక్యారం సోసైటీ మాజీ చైర్మన్ వాంకుడోత్ సామ్యానాయక్ మృతి చెందారు. ఆయన మృతదేహాన్ని మంగళవారం సందర్శించిన సీపీఐ(ఎం) నేతలు పార్టీ పతాకాన్ని పరసి నివాళ్లు అర్పించారు.

వివరాలు లోపలిపేజీలో..

# మీ ఆవేదన, ఆక్రోశం దేని కోసం

**హైదరాబాద్ :** నిజామాబాద్‌లో జాతీయ పసుపు బోర్డు ఏర్పాటు చేస్తూ.. కేంద్రం సోమవారం కీలక నిర్ణయం తీసుకుంది. మోదీ ప్రభుత్వ నిర్ణయాన్ని స్థానిక బీజేపీ ఎంపీ ధర్మపురి అరవింద్ స్వాగతించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుపై కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ నేపథ్యంలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు బుధవారం స్పందించారు. ఆ క్రమంలో ఎంపీ ధర్మపురి అరవింద్‌కు ఆయన బహిరంగ లేఖ రాశారు. నిజామాబాద్ జిల్లాలో పసుపు బోర్డు ఏర్పాటు చేస్తూ కేంద్ర ప్రభుత్వం నిర్ణయం ప్రకటించిన సందర్భంగా తనపై మీరు చేసిన అనుచిత వ్యాఖ్యల పట్ల మంత్రి తుమ్మల తీవ్ర అభ్యంతరాన్ని వ్యక్తం చేశారు. నిజామాబాద్ రైతుల సుదీర్ఘ పోరాటం, చిరకాల నిరీక్షణ అనంతరం కేంద్ర ప్రభుత్వం పసుపు బోర్డు ఏర్పాటు చేయడం హర్షించదగ్గ విషయమన్నారు. రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రిగానే కాకుండా.. ఒక రైతుగా తనకు ఎంతో ఆనందాన్ని కలిగించిందని చెప్పారు. ఈ సందర్భంగా.. పార్టీ, ప్రభుత్వంతో నిమిత్తం లేకుండా ప్రధాని నరేంద్ర మోదీకి, కేంద్ర ప్రభుత్వానికి తాను ధన్యవాదాలు తెలియజేశానని తెలిపారు. ఈ సందర్భంగా తన రాజకీయ జీవితం గురించి మీరు చేసిన వ్యాఖ్యలు తీవ్ర అభ్యంతరకరం...ఆక్షేపణీయంగా ఉన్నాయంటూ ఎంపీ దర్మపురి అరవింద్‌కు తెలియజేశారు. ఈ స్థాయికి దిగజారి మీరు మాట్లాడతారని తాను ఊహించలేదని పేర్కొన్నారు. తన రాజకీయ ప్రస్థానం పట్ల అవగాహన రాహిత్యమో, సమాచార లోపమో తెలియదు కానీ మీ వ్యాఖ్యలు ఎంత మాత్రం ఆమోదయోగ్యం కానివని స్పష్టం చేశారు.

1983 నుంచి నేటి వరకు తన రాజకీయ జీవితం తెరచిన పుస్తకమన్నారు. పదవుల కోసం, పార్టీ టికెట్ల కోసం ఏ నాడు, ఏ నాయకుడి వద్ద తాను మోకరిల్లింది లేదు... ఆత్మగౌరవాన్ని అమ్ముకున్నదని తెలిపారు. తన 40 ఏళ్ల సుదీర్ఘ రాజకీయ జీవితంలో ప్రతిక్షణం ప్రజాహితమే తప్ప వ్యక్తిగత స్వార్థం లేదు... ఇకపై ఉండబోదు కూడా అని స్పష్టం చేశారు. ఆ నాడు నందమూరి తారక రామారావు లాంటి మహానుభావుడి నుంచి నేడు రేవంత్ రెడ్డి వరకు ఏ కేబినెట్‌లో పని చేసినా, ఏ హోదాలో విధులు నిర్వర్తించినా రాష్ట్ర అభివృద్ధి, రైతులు సంక్షేమం, పేదల పక్షపాతం తప్ప తనకు మరో ఎజెండా అయితే లేదన్నారు.

చంద్రబాబు నాయుడు కావచ్చు... చంద్రశేఖర్ రావు (కేసీఆర్) కావచ్చు.. రాజకీయంగా, సిద్ధాంత పరంగా తనతో విభేదించవచ్చు కానీ.. ప్రజల పట్ల, రాష్ట్రం పట్ల తన



కమిట్‌మెంట్‌ను ప్రశ్నించ లేదని వివరించారు. నాయకుడు ఎవరైనా, పార్టీ ఏదైనా ప్రజాహితమే తన అభిమతంగా పని చేశానని చెప్పారు. తనను పార్టీలో చేర్చుకోండి, టికెట్ ఇవ్వండి, పదవి ఇవ్వండంటూ ఈ 40 ఏళ్ల రాజకీయ ప్రయాణంలో ఏనాడు, ఎవరిని అడిగింది లేదని తెలిపారు. తన వల్ల సమాజానికి మంచి జరగుతుంది, తన పని తీరుతో రాష్ట్రానికి మేలు జరుగుతుందని విశ్వసించి ఆయా పార్టీల నేతలను తనను కోరుకున్నారని గుర్తు చేశారు. ప్రజలు ఆదరించారు తప్ప... తాను ఏ పార్టీ గుమ్మం ముందు, ఏ నాయకుడు వద్ద సాగిలపడింది లేదని స్పష్టం చేశారు.

ఈ తన రాజకీయ జీవితంలో ఉమ్మడి రాష్ట్రంలో కానీ.. తెలంగాణ రాష్ట్రంలో కానీ.. ఏ మూలకు వెళ్లినా అక్కడ అభివృద్ధి ఆనవాళ్లలో తన గుర్తులు కనిపిస్తాయన్నారు. సాగునీటి ప్రాజెక్టులైనా, జాతీయ రహదారులైనా వాటి నిర్మాణంలో తన పాత్ర, తన శ్రమ ఉంటుందని తెలిపారు. మీరు పుట్టి పెరిగిన నిజామాబాద్ జిల్లాలోనే కౌలాస్ నాలా, సింగీతం కల్యాణి, లక్ష్మీ కెనాల్, శారదా సాగర్, లక్ష్మీ సాగర్, ఇందల్వాయి, గుత్ప లిఫ్ట్ ఇరిగేషన్ రూపకల్పన నుండి పూర్తి చేయడం వరకు ఉమ్మడి రాష్ట్రంలో నీటిపారుదల శాఖ మంత్రిగా ఉన్నప్పుడు జరిగినవేనని ఈ లేఖలో గుర్తు చేశారు. ఆ సమయంలో మీ నాన్నగారు ఉన్నారు కానీ.. మీరు ఎక్కడ, ఏ పార్టీలో ఉన్నారో కూడా తనకు తెలియదన్నారు. స్వర్గీయ పీవీ నర్సింహారావు హయాంలో వరద కాల్వ మంజూరు చేయించడంలో తన పాత్ర గురించి మీ జిల్లా ప్రజలను, నాయకులను అడిగి తెలుసుకుంటే మంచిదంటూ ఎంపీ దర్మపురి అరవింద్‌కు హితవు పలికారు.

ప్రస్తుతం రాష్ట్రంలో నిర్మాణమైన, నిర్మాణంలోనున్న ఏ జాతీయ రహదారి తీసుకున్నా.. వాటి మంజూరులో, నిర్మాణంలో తన ప్రయత్నంతోపాటు ప్రమేయం సైతం ఉందని స్పష్టం చేశారు. మీరు పార్టీలో కేంద్ర మంత్రులుగా పని చేసిన, చేస్తున్న శ్రీ నితిన్ గడ్కరి గారిని, శ్రీ కిషన్ రెడ్డి గారిని అడిగితే తన పాత్ర, ప్రమేయం గురించి వారే వివరిస్తారన్నారు. ముఖ్యమంత్రులు ఎవరైనా, వారి సహకారం తీసుకుని రాష్ట్రాభివృద్ధి కోసం పని చేశానని స్పష్టం చేశారు. జైకా నిధులతో %==% ప్రారంభించడం వెనుక తన పాత్ర ఉందని స్పష్టం చేశారు. రాష్ట్రంలో నిర్మించిన అన్ని రహదారులు, నీటిపారుదల ప్రాజెక్టులు (కాళేశ్వరం మినహా) తన ప్రమేయం లేకుండా జరిగింది లేదన్నారు.

మీరు మొదటి సారి ఎన్నికల్లో నిలబడినప్పుడు, ప్రజలకు రాసిచ్చిన బాండ్ పేపరు గురించి తానిక్కడ ప్రస్తావించ లేదని.. ఎందుకంటే ఆ సమయంలో తాను నిర్వహిస్తున్న మంత్రిత్వ శాఖకు సంబంధం లేదని కుండ బద్దలు కొట్టారు. తాజాగా తాను వ్యవసాయ శాఖ మంత్రి హోదాలో జాతీయ పసుపు బోర్డు సాధించుకోవడం తన బాధ్యతగా భావించి కేంద్రంపై ఒత్తిడి తీసుకు వస్తూ వచ్చానని తెలిపారు. పసుపు బోర్డు ప్రకటించిన సందర్భంగా ప్రధాన మంత్రి గారికి ధన్యవాదాలు తెలిపానని.. దీంట్లో మీకున్న అభ్యంతరం ఏమిటి? మీ ఆవేదన, ఆక్రోశం దేని కోసం? బోర్డు ప్రకటన, ఏర్పాటు విషయంలో మీరు సమాఖ్య స్ఫూర్తిని ప్రదర్శించ లేదు. అయినా రైతుల ప్రయోజనాల దృష్ట్యా తాము సంయమనం పాటించామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తరపున బోర్డు ఏర్పాటు విషయంలో తగినంత సహకారం అందించడానికి తాము సిద్ధంగా ఉన్నామని గతంలోనే కేంద్రానికి తెలియజేశామన్నారు. ఇక బోధన్ చక్కెర కర్మాగారం గురించి సైతం మీరు ప్రస్తావించారని.. ఇది రాష్ట్ర పరిశ్రమల శాఖ పరిధిలోని అంశమని.. అయినా మంత్రివర్గ సభ్యుడిగా తన వంతు ప్రయత్నం చేస్తానన్నారు. సంబంధిత మంత్రితో మాట్లాడి.. ఏం చేయాలి.. ఎలా చేయాలో అది చేస్తామని ఈ లేఖ ద్వారా ఎంపీ దర్మపురి అరవింద్‌కు స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలో.. స్థాయి దిగజార్చుకుని మీరు మాట్లాడిన మాటలు సరైనవి కావని తాను భావిస్తున్నానన్నారు. రెండు పర్యాయాలు లోక్‌సభ సభ్యుడిగా ఎన్నికైన మీరు ఇంతటి అధమ భాషను వాడటం సభ్యత అనిపించుకోదని ఎంపీ అరవింద్‌కు సూచించారు. పరిపక్వత లేని మాటలు మాట్లడకుండా, కొద్దిగా సహనంతో, రాజకీయ పరిజ్ఞానంతో మాట్లాడితే బాగుంటుందని ఆయనకు హితవు పలుకుతున్నానన్నారు. మీ వ్యాఖ్యల పట్ల తీవ్ర అభ్యంతరాన్ని వ్యక్తం చేస్తున్నానని.. వాటిని మీ విజ్ఞతకే వదిలేస్తున్నానంటూ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు.

## బోయిని పేటలో లక్ష్మీ దేవర బోనాల జాతర

### భారీ ఎత్తున బోనాలు సమర్పించిన మహిళలు

**మంథని :** మంథని మున్సిపల్ పరిధిలోని ఆరవ వార్డు బోయిన్ పేట ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో లక్ష్మీదేవి బోనాల జాతర ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో అంగరంగ వైభవంగా నిర్వహించారు. స్వతాగగా బంతిపూలతో దేవాలయం చుట్టూ సువర్ణ సుందరంగా ఆలయాన్ని తీర్చిదిద్దారు. సంక్రాంతి పండుగ పురస్కరించుకొని లక్ష్మీదేవికి మహిళలు భారీ సంఖ్యలో పాల్గొని అమ్మవారికి బోనం ఎత్తుకొని అమ్మవారికి మొక్కులు చెల్లించారు. లక్ష్మీ దేవర పట్నాలు వేసి అమ్మవారి బండారిని తీసుకొని ముడుపులు చెల్లించారు. ప్రతి సంవత్సరం సంక్రాంతి రోజున నిర్వహించే ఈ లక్ష్మీ దేవర బోనాల జాతరకు వేలాదిమంది భక్తులు దర్శించుకుని మొక్కులు చెల్లించుకుంటారు. కష్టాలు వచ్చినా నష్టాలు వచ్చినా అమ్మవారి అండ తప్పకుండా ఉంటుందని

## ఘనంగా ముగిసిన ధనుర్మాస భజన కార్యక్రమం

**-చక్రీభజన లో పాల్గొన్న భక్తులు**

**మంథని :** ధనుర్మాసమును పురస్కరించుకొని స్థానిక శ్రీ లక్ష్మీ నారాయణ స్వామి దేవాలయంలో నెల రోజులపాటు నిర్విరామంగా నిర్వహించిన భజన మంగళవారం (అర్ధ రాత్రి ) వరకు నిర్వహించిన కార్యక్రమం "చక్రీభజన"తో ఘనంగా ముగిసింది. డిసెంబర్ 16 నుండి జనవరి 14 అర్ధ రాత్రి వరకు నెలరోజుల పాటు అన్ని వాడలకు చెందిన భక్తులు ఈ భజన కార్యక్రమంలో పాల్గొన్నారు. మకర సంక్రాంతి పర్వదినమున పురస్కరించుకొని ఆలయంలో భజనపరులు పాలీలకు చెందిన భక్తులతో చక్రి భజన కార్యక్రమాన్ని నిర్వహించారు. చూడముచ్చటగా కొనసాగిన ఈ భజన కార్యక్రమంలో పట్టణంలోని వేలాది మంది భక్తులు ఈ కార్యక్రమాన్ని తిలకించారు. స్థానికంగా ఎంతో ప్రతిష్టాత్మకత కలిగిన శ్రీ లక్ష్మీ నారాయణ స్వామి దేవాలయంలో పది సంవత్సరం ధనుర్మాసంలో నెల రోజుల పాటు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తుంటారు.

# చౌటపల్లి గ్రామంలో లిఫ్ట్ నీళ్లు రావడంతో హర్షం వ్యక్తం చేస్తున్న రైతులు.

**-చౌటపల్లి లిఫ్ట్ ఇరిగేషన్ నీళ్లు ఇచ్చిన మంత్రి పొంగులేటికి ధన్యవాదాలు**

**పాలేరు జనవరి15 ప్రజా జ్యోతి**



పాలేరు నియోజకవర్గం, కూసుమంచి మండలం చౌటపల్లి గ్రామ పరిసర ప్రాంతాలకు గతంలో కాంగ్రెస్ ప్రభుత్వ హయంలో పాలేరు మాజీ ఎమ్మెల్యే, మాజీ మంత్రి వర్యులు గౌ. శ్రీ సంబాని చంద్రశేఖర్ పాలేరు నియోజకవర్గంలో ఉన్న బిడు భూములకు నీళ్లను అందించాలనే సంకల్పంతో పాలేరు చెరువు నుండి బచ్చోడు దాక పైప్ లైన్ వేసి నీళ్లను అందించారు. ఈ మధ్య కాలంలో వచ్చిన అకాల వరదల్లో అంత మునిగి పోవటంవలన, ట్రాన్స్ఫుర్మ్ సామాన్లు దొంగలు దొంగిలి0చడ0 వలన చౌటపల్లి, బోడియాతండా, పురియా తండా గ్రామ రైతులు పాలేరు నియోజకవర్గ ఎమ్మెల్యే తెలంగాణ రాష్ట్ర రెవిన్యూ, గృహ నిర్మాణ శాఖ మంత్రి వర్యులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి కి తెలియచేయటం జరిగింది. ఈ విషయం తెలుసుకున్న మంత్రివర్యులు వెంటనే స్పందించి క్యాంప్ ఆఫీస్ ఇంచార్జ్ దయాకర్ రెడ్డి కి చెప్పగా వారు స్పందించి వారం రోజుల్లో ఆ పనిని పూర్తి చేయించి సంక్రాంతి పండుగైన ఈ రోజున నీళ్లు విడుదల చేయించి రైతుల మొహాల్లో ఆనందం కల్పించారు. నీళ్లు రావడంతో యాసంగి పంట కూడా పండుతుందని రైతులు, గ్రామ నాయకులు కొవ్వూరి పెద్ద వెంకట్ రెడ్డి, కందల రవి, బోడ వీరు నాయక్, మక్కా రామకృష్ణ, గండు రామన్న తుర్కా వెంకన్న గుర్రాల నాగన్న వెంకన్న, గుమ్మడేల్లీరాజు, మల్లయ్య, వెంకన్న, అందరు మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి కి హృదయ పూర్వక ధన్యవాదములు తెలియజేశారు.

# తాళ్లూరి బ్రదర్స్ ఆద్వర్యం లో మోటమర్రి గ్రామంలో ఘనంగా ముగ్గుల పోటీలు




**మధిర ఆర్సి ప్రజా జ్యోతి**

బోనకల్ మండలం, మోటమర్రి గ్రామం లో తాళ్లూరి బ్రదర్స్ ఆద్వర్యం లో సంక్రాంతి పండుగ సందర్భంగా ఘనంగా ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ ముగ్గుల పోటీలను ప్రతి ఏడాది సంక్రాంతికి గ్రామానికి చెందిన ఉపాధ్యాయులు తాళ్లూరి సుబ్బారావు, తాళ్లూరి రమేష్, సోదరులు కలసి గ్రామం లో పెద్ద ఎత్తున ముగ్గుల పోటీలు నిర్వహిస్తున్నారు. ఈ ఏడాది కూడా నిర్వహించిన ముగ్గుల పోటీలకు మహిళల నుండి అపూర్వ స్పందన లభించింది పెద్ద ఎత్తున మహిళలు పాల్గొని ముగ్గులు వేశారు. అనంతరం విజేతలకు టీడీపీ ఖమ్మం పార్లమెంట్ పార్టీ కన్వీనర్ లిడా. వాసిరెడ్డి రామనాథం, సొసైటీ చైర్మన్ బోజెడ్ల పుల్లారావు, డీసీసీబీ మాజీ డైరెక్టర్ బోజెడ్ల అప్పారావు, నాయకులు తాళ్లూరి హరీష్ బాబులితదితరులు పాల్గొని బహుమతులు అందించారు.

# నాలుగు సంక్షేమ పథకాల సర్వే ప్రక్రియ పారదర్శకంగా పూర్తి చేయాలి

**-జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్**

**-లబ్ధిదారుల ఎంపిక అనేది నిరంతర ప్రక్రియ**

**-అర్హులందరికి ప్రభుత్వ ఫలాలు అందాలి**

**-4 క్రొత్త పథకాల అమలుపై అధికారులతో సమీక్షించిన జిల్లా కలెక్టర్**

**ఖమ్మం ప్రతినిధి ప్రజా జ్యోతి**



రాష్ట్ర ప్రభుత్వం జనవరి 26 నుండి అమలుచేయనున్న 4 సంక్షేమ పథకాల క్షేత్ర స్థాయి సర్వే ప్రక్రియ పారదర్శకంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ తెలిపారు. బుధవారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో ప్రభుత్వం అమలు చేయనున్న 4 పథకాలపై స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డా. పి. శ్రీజ తో కలిసి సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, క్రొత్త రేషన్ కార్డుల జారీ, ఇందిరమ్మ ఇండ్లకు సంబంధించి ప్రభుత్వం విధి విధానాలు జారీచేసిందన్నారు. పథకాల అమలుపై అధికారులకు స్పష్టమైన అవగాహన ఉండాలన్నారు. లబ్ధిదారుల ఎంపిక అనేది నిరంతర ప్రక్రియ అని, దీనిపై ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదనే విషయాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరు పథకాల లబ్ది పొందేలా అధికారులు చర్యలు తీసుకోవాలని అన్నారు. రైతు భరోసా క్రింద ప్రభుత్వం వ్యవసాయ యోగ్యమైన భూములకు ఎకరాకు సంవత్సరానికి 12 వేలు ఇవ్వనుందని కలెక్టర్ అన్నారు. అధికారులు క్షేత్ర స్థాయిలో వ్యవసాయ యోగ్యం కాని భూములను గుర్తించాలన్నారు. జిల్లాలో మొత్తం 589 గ్రామాలు ఉండగా, 380 రెవెన్యూ గ్రామాలు ఉన్నాయన్నారు. గ్రామాల వారిగా పాస్ బుక్ లను విభజించాలన్నారు. ఆర్ఐ, ఏఇఓ లు క్షేత్ర తనిఖీలు చేసి, వ్యవసాయ యోగ్యం, వ్యవసాయ యోగ్యం కాని భూముల గుర్తింపు చేయాలన్నారు. నివేదికలకు ఒక ఫార్మాట్ రూపొందించి, క్షేత్ర అధికారులకు అందజేయాలన్నారు. నేటి నుండి (గురువారం) నుండి సర్వే ప్రారంభించి, ఈ నెల 1లోగా పూర్తయ్యేలా చర్యలు చేపట్టాలన్నారు. ఈ నెల 20 నుండి గ్రామ సభల నిర్వహణకు కార్యాచరణ చేయాలన్నారు. గ్రామ సభల్లో గ్రామ కార్యదర్శి తోపాటు, సంబంధిత శాఖ అధికారులు తప్పనిసరిగా పాల్గొనాలన్నారు. గ్రామ సభ నిర్వహణకు విధి విధానాలు ఖచ్చితంగా పాటించాలని, వీడియోగ్రఫీ చేయాలని కలెక్టర్ అన్నారు. ఈ నెల 21, 22 తేదీల్లో తహసీల్దార్, మండల వ్యవసాయ అధికారులు రీ వెరిఫై చేయాలని కలెక్టర్ తెలిపారు. ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకానికి సంబంధించి సంవత్సరానికి 12 వేలు, రెండు విడతలుగా లబ్ధిదారులకు ప్రభుత్వం అందజేస్తుందన్నారు. ఉపాధిహామీ జాబ్ కార్డు ఉండి, భూమిలేక, గత సంవత్సరం కనీసం 20 రోజులు ఉపాధిహామీ పనులు చేసిన వారికి ఆత్మీయ భరోసా పథకానికి అర్హులన్నారు. లబ్ధిదారులకు జాబ్ కార్డ్ లో భూమి వుండకూడదన్నారు. పథక సర్వే ఈ నెల 18లోగా పూర్తిచేసి, 20న చేపట్టే గ్రామ సభల్లో ప్రజల ముందు ఉంచాలన్నారు. క్రొత్త రేషన్ కార్డుల జారీకి మండల స్థాయిలో ఎంపిడివో లు, మునిసిపల్ కమీషనర్ లు, జిల్లా స్థాయిలో అదనపు కలెక్టర్, జిల్లా పౌరసరఫరాల అధికారి ధృవీకరణ బాధ్యత ఉంటుందన్నారు. ప్రభుత్వం నుండి జారీచేసిన ఫార్మాట్ లో సర్వే నివేదిక సమర్పించాలన్నారు. ప్రభుత్వం మార్గదర్శకాల మేరకు అర్హుల ఎంపిక ప్రక్రియ పూర్తి చేయాలన్నారు. ఇందిరమ్మ ఇండ్ల సర్వే జిల్లా వ్యాప్తంగా ముగింపు దశకు చేరిందన్నారు. సర్వే సమయంలో ఒక గ్రామం/ప్రాంతంలో ఉన్న కాని, లబ్దిదారునికి భూమి ఏ గ్రామం/ప్రాంతంలో ఉంటే, ఆయా గ్రామ/ప్రాంతాల్లో మంజూరులు ఇవ్వాలన్నారు. ప్రతి దశలో ప్రభుత్వ మార్గదర్శకాలు తూ. చ. తప్పకుండా పాటించాలన్నారు. గ్రామ, మండల, నియోజకవర్గ, జిల్లా తనిఖీలు పకడ్బందీగా చేయాలన్నారు. మొదటి విడతలో నిరుపేదలకు ప్రాధాన్యం ఇవ్వాలని, జిల్లా, మండల, గ్రామ స్థాయి అధికారులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ అన్నారు. ఈ సమీక్ష లో డిఆర్డీవో సన్యాసయ్య, డిపిఓ ఆశాలత, డిసిఎస్ఓ చందన్ కుమార్, డీఏఓ పుల్లయ్య, పిడి హౌజింగ్ బి. శ్రీనివాస్, అదనపు డిఆర్డీవో నూరొద్దీన్, డీఎల్పిఓ రాంబాబు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# గ్రామీణ క్రీడలు మానసిక, శారీరక, ఆరోగ్యాన్నిస్తాయి.



**-మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నరసయ్య.**



**కారేపల్లి, జనవరి 15, ప్రజాజ్యోతి:**

సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ పి వై ఎల్ పి ఓ డబ్ల్యు పి డి ఎస్ యు ప్రజా సంఘాల ఆధ్వర్యంలో సింగరేణి మండలం టేకులగూడెం గ్రామంలో యువతీ యువకులను ఉత్సాహ పరిచేందుకు సంక్రాంతి సందర్భంగా గ్రామీణ క్రీడలు ముగ్గులు, శంషా నిమ్మకాయ, కుండ కొట్టుడు పోటీలు నిర్వహించారు. అనంతరం ప్రజాపంథా మండల కార్యదర్శి గుమ్మడి సందీప్ అధ్యక్షతన జరిగిన సభలో గెలుపొందిన వారికి బహుమతులు ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ రాష్ట్ర నాయకులు మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నరసయ్య మాట్లాడుతూ సంక్రాంతి పండుగ సందర్భంగా గ్రామీణ క్రీడలు ముగ్గుల పోటీలు, నిమ్మకాయ శంషా ఆట డాన్స్ పోటీలు నిర్వహించడం వలన యువతి యువకుల్లో ఐక్యత, స్నేహం,సుహృద్భావ వాతావరణం, మానసిక ఉల్లాసం, ఆత్మీయత పెరుగుతాయని అన్నారు. నేడు సమాజంలో విష సంస్కృతి,అవిద్య, అజ్ఞానం, మూఢనమ్మకాలు, పేదరికం, మోసాలు,స్త్రీలపై అత్యాచారాలు,ప్రభుత్వాలు మద్యపాన వ్యాపారాలు చేయడం,త్రాగిన ప్రజలు ప్రక్కదారులు పట్టడం వలన,శ్రమ సంస్కృతి మరుగున పడిపోతుందని, పెట్టుబడిదారీ వర్గాలు లాభ పడుతున్నాయని అన్నారు. ప్రజలను విభజించి పాలించే పరిస్థితులు నేడు ఎక్కువగా ఉన్నాయని అన్నారు. సినిమాలు, టీవీ సీరియల్లో ప్రజలలో ఈర్ష ద్వేషాలు, పగ, కక్షలు, కార్పన్యాలు పెంచుతున్నయనీ అన్నారు. కుటుంబాలలో కలతలు, తగాదాలు సృష్టిస్తున్నాయని వారు విమర్శించారు. ప్రజా వ్యతిరేకమైన సాహిత్యాన్ని నిషేధించాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పి ఓ డబ్ల్యు రాష్ట్ర కార్యదర్శి సిహెచ్ శిరోమణి, మాస్ లైన్ డివిజన్ కార్యదర్శి టి ఝాన్సీ, పి ఓ డబ్ల్యు జిల్లా కార్యదర్శి ఆవుల మంగతాయి, పిడిఎస్యు రాష్ట్ర నాయకులు కాంపాటి పృథ్వి, గుమ్మడి పవిత్ర ,టిపిటిఎఫ్ నాయకులు గుమ్మడి పాపారావు, గుమ్మడి సమ్మయ్య ,మాస్ లైన్ మండల నాయకులు బిక్క సాని భాస్కర్, రంగ్య ,వెంకన్న, సూర్పాక అనసూయ, సరోజిని , ధరావత్ సక్రు, రామారావు, కనకరాజు, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

# నిజామాబాద్ లోక్ సభ సభ్యుడు ధర్మపురి అరవింద్ కి

**-రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు బహిరంగ లేఖ**

ఖమ్మం ప్రతినిధి ప్రజా జ్యోతి



నిజామాబాద్ జిల్లాలో పసుపు బోర్డు ఏర్పాటు చేస్తూ కేంద్ర ప్రభుత్వం నిర్ణయం ప్రకటించిన సందర్భంగా నాపై మీరు చేసిన అనుచిత వ్యాఖ్యలపట్ల తీవ్ర అభ్యంతరాన్ని వ్యక్తం చేస్తూ... ధర్మపురి అరవింద్ నిజామాబాద్ రైతుల సుదీర్ఘ పోరాటం, చిరకాల నిరీక్షణ తర్వాత కేంద్ర ప్రభుత్వం పసుపు బోర్డు ఏర్పాటు చేయడం హర్షించదగ్గ విషయం. రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రిగానే కాక, ఒక రైతుగా నాకు ఎంతో ఆనందాన్ని కలిగించిన అంశం ఇది. ఈ సందర్భంగా... పార్టీ, ప్రభుత్వంతో నిమిత్తం లేకుండా ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీకి, కేంద్ర ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలియజేశాను.

ఈ సందర్భంగానా రాజకీయ జీవితం గురించి మీరు చేసిన వ్యాఖ్యలు తీవ్ర అభ్యంతరకరం...ఆక్షేపణీయం. ఈ స్థాయికి దిగజారి మీరు మాట్లాడతారని నేను ఊహించలేదు. నా రాజకీయ ప్రస్థానం పట్ల అవగాహన రాహిత్యమో, సమాచార లోపమో తెలియదు కానీ మీ వ్యాఖ్యలు ఎంత మాత్రం ఆమోదయోగ్యం కాదు. 1983 నుండి ఈ నాటి వరకు నా రాజకీయ జీవితం తెరచిన పుస్తకం. పదవుల కోసం, పార్టీ టికెట్ల కోసం ఏ నాడు, ఏ నాయకుడి వద్ద నేను మోకరిల్లింది లేదు... ఆత్మగౌరవాన్ని అమ్ముకున్నది లేదు. 40 ఏళ్ల నా సుదీర్ఘ రాజకీయ జీవితంలో ప్రతిక్షణం ప్రజాహితమే తప్ప వ్యక్తిగత స్వార్థం లేదు... ఇకపై ఉండబోదు కూడా! ఆ నాడు శ్రీ నందమూరి తారక రామారావు లాంటి మహానుభావుడి నుండి నేడు రేవంత్ రెడ్డి వరకు ఏ కేబినెట్ లో పని చేసినా, ఏ హోదాలో విధులు నిర్వర్తించినా రాష్ట్ర అభివృద్ధి, రైతులు సంక్షేమం, పేదల పక్షపాతం తప్ప నాకు మరో ఎజెండా లేదు. చంద్రబాబు నాయుడు కావచ్చు చంద్రశేఖర్ రావు కావచ్చు రాజకీయంగా, సిద్ధాంత పరంగా నాతో విభేదించవచ్చు కానీ... ప్రజల పట్ల, రాష్ట్రం పట్ల నా కమిట్ మెంట్ ను ప్రశ్నించలేదు. నాయకుడు ఎవరైనా, పార్టీ ఏదైనా ప్రజాహితమే నా అభిమతంగా పని చేశాను. నన్ను పార్టీలో చేర్చుకోండి, నాకు టికెట్ ఇవ్వండి, నాకు పదవి ఇవ్వండి అని ఈ 40 ఏళ్ల ప్రయాణంలో ఏ నాడు, ఎవరిని అడిగింది లేదు. నా వల్ల సమాజానికి మంచి జరగుతుంది, నా పని తీరుతో రాష్ట్రానికి మేలు జరుగుతుంది అని భావించి, విశ్వసించి ఆయా పార్టీలు, నాయకులు నన్ను కోరుకున్నారు, ప్రజలు ఆదరించారు తప్ప... నేను ఏ పార్టీ గుమ్మం ముందు, ఏ నాయకుడు వద్ద సాగిలపడింది లేదు. ఈ 40 ఏళ్ల రాజకీయ జీవితంలో ఉమ్మడి రాష్ట్రంలోనైనా, తెలంగాణ రాష్ట్రంలోనైనా ఏ మూలకు వెళ్లినా అక్కడ అభివృద్ధి ఆనవాళ్లలో నా గుర్తులు కనిపిస్తాయి. సాగునీటి ప్రాజెక్టులైనా, జాతీయ రహదారులైనా వాటి నిర్మాణంలో నా పాత్ర, నా శ్రమ ఉంటుంది. శిలా ఫలకాలపై నా పేరు కనిపిస్తుంది. మీరు పుట్టి పెరిగిన నిజామాబాద్ జిల్లాలోనే కౌలాస్ నాలా, సింగీతం కల్యాణి, లక్ష్మీ కెనాల్, శారదా సాగర్, లక్ష్మీ సాగర్, ఇందల్వాయి, గుత్ప లిఫ్ట్ ఇరిగేషన్ రూపకల్పన నుండి పూర్తి చేయడం వరకు ఉమ్మడి రాష్ట్రంలో నీటిపారుదల శాఖ మంత్రిగా ఉన్నప్పుడు జరిగినవే. ఆ సమయంలో మీ నాన్న ఉన్నారు, మీరు ఎక్కడ, ఏ పార్టీలో ఉన్నారో కూడా నాకు తెలియదు. స్వర్గీయ -పీవీ నర్సింహారావు హయాంలో వరద కాల్వ మంజూరు చేయించడంలో నా పాత్ర గురించి మీ జిల్లా ప్రజలను, నాయకులను అడిగి తెలుసుకుంటే మంచిది. ప్రస్తుతం రాష్ట్రంలో నిర్మాణమైన, నిర్మాణంలో ఉన్న ఏ జాతీయ రహదారి తీసుకున్నా వాటి మంజూరులో, నిర్మాణంలో నా ప్రయత్నం, ప్రమేయం ఉంది. మీరు ప్రాతినిధ్యం వహిస్తున్న పార్టీ నుండి కేంద్ర మంత్రులుగా పని చేసిన, చేస్తున్న నితిన్ గడ్కరి ని, శ్రీ కిషన్ రెడ్డి ని అడిగితే నా పాత్ర, ప్రమేయం గురించి వారే చెబుతారు. నా రాజకీయ జీవితం, నా వ్యక్తిత్వం గురించి మీ పార్టీ సీనియర్ నాయకులు విద్యాసాగర్ రావు ని, లక్ష్మణ్ ని,బండారు దత్తాత్రేయ ని అడిగి తెలుసుకోండి. ముఖ్యమంత్రులు ఎవరైనా, వారి సహకారం తీసుకుని రాష్ట్ర అభివృద్ధి కోసం పని చేశాను. జైకా నిధులతో ఓ ఆర్ ఆర్ ప్రారంభించడం వెనుక నా పాత్ర ఉంది. రాష్ట్రంలో నిర్మించిన అన్ని రహదారులు, నీటిపారుదల ప్రాజెక్టులు (కాళేశ్వరం మినహా) నా ప్రమేయం లేకుండా జరిగింది లేదు. మీరు మొదటి సారి ఎన్నికల్లో నిలబడినప్పుడు, ప్రజలకు రాసిచ్చిన బాండ్ పేపరు గురించి నేనెక్కడా ప్రస్తావించలేదు. ఎందుకంటే అప్పుడు నేను నిర్వహిస్తున్న మంత్రిత్వ శాఖకు సంబంధం లేదు. తాజాగా నేను వ్యవసాయ శాఖ మంత్రి హోదాలో జాతీయ పసుపు బోర్డు సాధించుకోవడం నా బాధ్యతగా భావించి కేంద్రంపై ఒత్తిడి తెస్తూ వచ్చాను. పసుపు బోర్డు ప్రకటించిన సందర్భంగా ప్రధాన మంత్రి గారికి ధన్యవాదాలు తెలిపాను. దీంట్లో మీకున్న అభ్యంతరం ఏమిటి? మీ ఆవేదన, ఆక్రోశం దేని కోసం? బోర్డు ప్రకటన, ఏర్పాటు విషయంలో మీరు సమాఖ్య స్ఫూర్తిని ప్రదర్శించలేదు. ఐనా రైతుల ప్రయోజనాల దృష్ట్యా మేం సంయమనం పాటించాం. రాష్ట్ర ప్రభుత్వం తరపున బోర్డు ఏర్పాటు విషయంలో తగినంత సహకారం అందించడానికి సిద్ధంగా ఉన్నామని ఇదివరకే తెలియజేశాం. ఇక బోధన్ చక్కెర కర్మాగారం గురించి మీరు ప్రస్తావించారు. అది రాష్ట్ర పరిశ్రమల శాఖ పరిధిలోని అంశం. ఐనా మంత్రివర్గ సభ్యుడిగా నా వంతు ప్రయత్నం చేస్తాను. సంబంధిత మంత్రితో మాట్లాడి, ఏం చేయాలి, ఎలా చేయాలో అది చేస్తాం. ఈ నేపథ్యంలో... స్థాయి దిగజార్చుకుని మీరు మాట్లాడిన మాటలు సరైనవి కావుఅని నేను భావిస్తున్నాను. రెండు పర్యాయాలు లోక్ సభ సభ్యుడిగా ఎన్నికైన మీరు ఇంతటి అధమ భాషను వాడటం సభ్యత అనిపించుకోదు. పరిపక్వతలేని మాటలు మాట్లడకుండా, కొద్దిగా సహనంతో, రాజకీయ పరిజ్ఞానంతో మాట్లాడితే బాగుంటుందని హితవు పలుకుతున్నాను. మీ వ్యాఖ్యల పట్ల తీవ్ర అభ్యంతరాన్ని వ్యక్తం చేస్తూ... వాటిని మీ విజ్ఞతకే వదిలేస్తున్నాను అన్నారు.

# గౌడ బిడ్డకు ఆర్థిక సాయం అందించిన జాగృత్ ఫౌండేషన్

**-సాయాన్ని అందించిన ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ కేనగాని రాజశేఖర్,అమరగాని వెంకన్న గౌడ్**

ఖమ్మం ప్రతినిధి ప్రజా జ్యోతి







బోనకల్ మండలంలోని మోటమర్రి గ్రామానికి చెందిన గౌడ బిడ్డ,మంద తిరుపతిరావు వెన్నముకకు గాయామై మంచానికి పరిమితమయ్యాడు. విషయం తెలుసుకున్న జాగృతి ఫౌండేషన్ చైర్మన్, జాగృతి హాస్పటల్స్ అధినేత ప్రముఖ వైద్యులు కేసగాని రాజశేఖర్ తిరుపతిరావును పరామర్శించి, మనోధైర్యాన్ని నింపారు. తిరుపతిరావు కుటుంబ సభ్యులకు సిపిఐ మండల కార్యదర్శి యంగల ఆనందరావుతో కలిసి చెక్కును అందజేసి, వారి కుటుంబానికి అండగా నిలుస్తామని తెలిపారు. ఈ సందర్భంగా వైద్యులు రాజశేఖర్ మాట్లాడుతూ గీత కార్మికులకు అండగా నిలించేందుకు జాగృతి ఫౌండేషన్ను స్థాపించనట్లు తెలిపారు. ఇప్పటికే ఖమ్మం జిల్లాలో ప్రమాదానికి గురైన గీత కార్మికులకు జాగృతి ఫౌండేషన్ ఆర్థిక సాయం అందించిందని తెలిపారు. రానున్న రోజుల్లో జాగృతి ఫౌండేషన్ మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో అమరగాని వెంకన్న, తోడేటి దుర్గాప్రసాద్, కుక్కల నాగేశ్వరరావు, బెల్లకొండ శరత్, సంపెట వాసు, సిపిఐ నాయకులు బుర్రి నాగేశ్వరరావు, మరీదు నాగేశ్వరరావు, పోతగాని పుల్లారావు, ఉపేందర్, మందా కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

# సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపిన కాంగ్రెస్ నాయకులు.






కారేపల్లి, జనవరి15, ప్రజా జ్యోతి:

సంక్రాంతి పండుగను పురస్కరించుకొని మంగళవారం సింగరేణి మండల కాంగ్రెస్ నాయకులు, తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, వైరా శాసనసభ్యులు రాందాస్ నాయక్ లకు శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్ర కాంగ్రెస్ నాయకురాలు పగడాల మంజుల, మైనారిటీ నాయకులు ఎండి యాకూబ్ అలీ, తాజుద్దీన్ లు మధిరలోని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్చం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. మండలంలోని పలు అభివృద్ధి కార్యక్రమాల గురించి చర్చించినట్లు పేర్కొన్నారు. అనంతరం సింగరేణి మండలం ప్రజలందరికీ సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత పది సంవత్సరాలతో పోలిస్తే ఈ సంవత్సరం మాత్రమే మహిళలు పూర్తిస్థాయి ఉచితంగా, ఎటువంటి అదనపు చార్జీలు లేకుండా సాధారణ ప్రజలు ప్రయాణాలు సాగించి తమ పండగ ఆర్థిక భారాన్ని లేకుండా చేసుకున్నారన్నారు. మహిళల ఉచిత ప్రయాణంతో ఉద్యోగ, ఉపాధి కోసం పల్లెల నుంచి వెళ్లి అనేకచోట్ల నివసిస్తున్న ఎంతోమందికి మేలు జరిగిందన్నారు. సంక్రాంతి ప్రయాణాలలో అధిక చార్జీలు భారం వేయకుండా ప్రైవేట్ బస్సులను సైతం రాష్ట్ర ప్రభుత్వం కట్టడి చేసిందని ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఇది ప్రజల పట్ల, ప్రజా పాలన పట్ల కాంగ్రెస్ ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధికి నిదర్శనం అన్నారు. భవిష్యత్తు కాలంలో మరింత ప్రజారంజకమైన పాలనను సాగిస్తుందని పేర్కొన్నారు.

# ఎమ్మెల్యేకు సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపిన ఉమాశంకర్.



కారేపల్లి, జనవరి 15 ప్రజాజ్యోతి :

సింగరేణి మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు, మాజీ ఎంపీటీసీ పెద్దబోయిన ఉమాశంకర్ వైరా ఎమ్మెల్యే మాళోత్ రాందాస్ నాయక్ ను భద్రాద్రి కొత్తగూడెం జిల్లా హేమచంద్రపురంలోని ఆయన స్వగృహంలో మంగళవారం మర్యాదపూర్వకంగా కలిసి, పుష్పగుచ్చం అందించి, సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారు సింగరేణి మండలానికి ఇటీవల అభివృద్ధి కార్యక్రమాలకు నిధులు కేటాయించడం పట్ల కృతజ్ఞతలు తెలుపుతూ, మరిన్ని నిధులు కేటాయించి, మండల అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు సుడిగాలి బిక్షమయ్య, రెడ్డబోయిన జగ్గయ్య, సొసైటీ డైరెక్టర్ మర్శకట్ల రోశయ్య తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా సంక్రాంతి పండుగ వేడుకలు.



**సత్తుపల్లి జనవరి15 ప్రజా జ్యోతి.**

పట్టణములోని కాకర్లపల్లి రోడ్ వెంకటేశ్వర రెసిడెన్సి బహుళ అంతస్తుల భవనవాసులు సంక్రాంతి పండుగ వేడుకలు ఘనంగా బుధవారం నిర్వహించారు. భోగి పండుగను పురస్కరించుకొని తెల్లవారుజామున భోగి మంటలు వేసి,ఆవు పేడతో తయారుచేసిన పిడకలను భోగిమంటల్లో వేసి,భోగి పండుగ వేడుకలను నిర్వహించారు. అనంతరం స్నానాలు ఆచరించి,నూతన వస్త్రాలు ధరించి గృహాలను మామిడి తోరణాలు, పూలతో తోరణాలు ,అరటి , కొబ్బరి మట్టలు , చెరుకు గడలు,గాలిపటాలతో అలంకరించారు. మహిళలు ఇంటి ముంగిళ్లను మన సాంస్కృతి,సాంప్రదాయాలను అద్దం పట్టేలా హరిదాసు, గంగిరెద్దు,చెరుకు గడలు, గాలిపటాలు, మట్టి కడవలో పాలు పొంగుతున్న దృశ్యాలను తెలియజేసే విధంగా ముగ్గులను వేశారు.ఆవు పేడతో తయారుచేసిన గొబ్బిళ్ళను ముగ్గులలో ఉంచి పసుపు, కుంకుమ, రేగిపళ్ళను గొబ్బెమ్మల్లో వుంచారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ మన సంస్కృతి సాంప్రదాయాలు, నేటి తరం పిల్లలకు తెలియజేయాలనుకునే ఆలోచన చాలా సంతోషంగా ఉందన్నారు. కళాకారులకు, కళలకు నేడు ఆదరణ తగ్గిపోయిందని, కళాకారులకు ప్రోత్సాహం లభించినప్పుడే ప్రాచీన కళలకు పూర్వ వైభవం వస్తుందన్నారు. సంక్రాంతి పండగ అంటే హరిదాసులు, గంగిరెద్దు మేళాలు గ్రామాల్లో సందడి చేసేవారని నేడు ఆ వాతావరణం కనుమరుగై పోయిందని అన్నారు. ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నప్రసాద కార్యక్రమాలు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో బండారు ఉమామహేశ్వరరావు, సంధ్యారాణి, అనంతోజ్ రాము, సుధారాణి,పూరేటి శ్రీనివాసరావు, రాజ్యలక్ష్మి, దంపతులు బండారు సాయి శ్రీరామ్, పూరేటి వరుణ్, లక్ష్మీ దీపక్,లక్ష్మీ ధీరజ్ తదితరులు పాల్గొన్నారు.

# నిరుపేద కుటుంబానికి గౌసుద్దీన్ సహాయం.




**కారేపల్లి, జనవరి 15, ప్రజాజ్యోతి:**

సింగరేణి మండల కేంద్రంలోని బీసీ కాలనీ చెందిన ముస్లిం మైనార్టీ కుటుంబానికి జిల్లా మైనార్టీ అధ్యక్షులు, మాజీ వార్డు సభ్యులు గౌసుద్దీన్ సహాయకర్తగా నిలిచారు. బుధవారం యాకూబ్ పాషా కూతురు కరీమా వివాహ సందర్భంగా పెళ్లి కానుకగా డ్రెస్సింగ్ టేబుల్, రైస్ కుక్కర్, దివాన్ కాట్ కుర్చీలు సుమారు రూ11000 లవి కానుకగా అందించారు. ఈ సందర్భంగా సహాయకార్డంగా నిలిచిన గౌసుద్దీన్ కు కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా గౌసుద్దీన్ మాట్లాడుతూ నిరుపేద కుటుంబాలకు అండగా నిలవాలని, ఆపదలో ఉన్నవారికి తన ఆర్థిక స్తోమతతో అండగా నిలుస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సద్దాం హుస్సేన్, అబ్దుల్లా, వాహిద్ ,వాహద్, ఫిరోజ్ ,సాంబ, ముస్తాక్, యాకుబ్ పాషా, సింగరేణి గ్రామపంచాయతీ వర్కర్స్ సుల్తానా బేగం తదితరులు పాల్గొన్నారు.

# మండలంలో విస్తృతంగా పర్యటించిన మాజీ ఎమ్మెల్యే రాములు నాయక్.









**కారేపల్లి, జనవరి 15, ప్రజాజ్యోతి:**

సింగరేణి మండలంలోని పలు గ్రామాల్లో వైరా మాజీ ఎమ్మెల్యే లావుడియా రాములు నాయక్ మంగళవారం విస్తృతంగా పర్యటించారు. భాగ్యనగర్ తండా గ్రామంలో సీపీఎం పార్టీ సీనియర్ నాయకులు, మాణిక్యారం మాజీ సొసైటీ చైర్మన్ వాంకుడొత్ సామ్య నాయక్ మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు లావుడియా ఈర్యా నాయక్ తండ్రి లావుడియా రంజిత్ కుమార్ ఇటీవల మరణించడంతో వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. భాగ్యనగర్ తండా టీడీపీ మాజీ ఎంపీటీసీ గుగులోత్ రాములు ఇటీవల మరణించడంతో వారి కుటుంబ సభ్యులను పరామర్శించి, ఓదార్చారు. అనంతరం కొత్తూరు తండ గ్రామానికి చెందిన అజ్మీర చంద్రావతి మరణించడంతో వారి మృతదేహానికి నివాళులర్పించారు. చిన్నమదంపల్లి గ్రామానికి చెందిన ఎంపీటీసీ బాణోత్ రమేష్ తండ్రి బాణోత్ మాన్ సింగ్ మరణించడంతో వారి మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో వైరా మాజీ ఆత్మ కమిటీ చైర్మన్ ముత్యాల సత్యనారాయణ, మాజీ జడ్పీటీసీ బాణోత్ దేవుల నాయక్, సొసైటీ వైస్ చైర్మన్ ధారవత్ మంగిలాల్, సొసైటీ డైరెక్టర్ ,సీనియర్ నాయకులు అడ్డగోడ ఐలయ్య, నాయకులు బత్తుల శ్రీనివాసరావు, అజ్మీర వీరన్న, జర్పుల ప్రసాద్, వాంకుడొత్ గాంధీ, మాజీ ఎంపీటీసీ లు భూక్య సోని జమ్లా, గద్దం వెంకటేశ్వర్లు, మాజీ సర్పంచ్ లు గుగులోత్ పద్మ మంగ్య, ధారావత్ భద్రు, భూక్య రంగారావు, ఆదినారాయణ, ధరవత్ రాజు, గుగులోత్ భగవాన్ దాస్, మాజీ మార్కెట్ కమిటీ డైరెక్టర్ వాంకుడొత్ నరేష్, నాయకులు తెలంగాణ ఉద్యమకారుడు జూపల్లి రాము, వాంకుడొత్ కరణ్ సింగ్, బాణోత్ రూప్ల, ధారావత్ బద్దులాల్, గుగులోత్ దంజి లాల్, తదితరులు పాల్గొన్నారు.

# జమిందార్లకు ఎదురు నిలిచిన నేత సామ్యానాయక్



**-నమ్మిన సిద్దాంతాన్ని కట్టుబడిన నిస్వార్థజీవి.**

**కారేపల్లి, జనవరి 15, ప్రజాజ్యోతి :**

సింగరేణి మండల పరిధిలోని ఉసిరికాయలపల్లి ప్రాంతంలో జమిందార్లకు ఎదురునిలిచిన నేత వాంకుడోత్ సామ్యానాయక్ అని సీపీఐ(ఎం) రాష్ట్ర నాయకులు పీ.సోమయ్య, జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావులు అన్నారు.సింగరేణి మండలం సామ్యాతండాకు చెందిన సీపీఐ(ఎం) సీనియర్ నాయకులు, మాణిక్యారం సొసైటీ మాజీ చైర్మన్ వాంకుడోత్ సామ్యానాయక్ మృతి చెందారు. ఆయన మృతదేహాన్ని మంగళవారం సందర్శించిన సీపీఐ(ఎం) నేతలు పార్టీ పతాకాన్ని పరిచి నివాళ్లు అర్పించారు. ఈసందర్భంగా సీపీఐ(ఎం) మండల కార్యదర్శి కే.నరేంద్ర అధ్యక్షతన జరిగిన సంతాప సభలో పీ.సోమయ్య, నున్నా నాగేశ్వరరావు లు మాట్లాడుతూ తాను నమ్మిన సిద్దాంతాన్ని కట్టుబడి ఎన్ని ప్రలోభాలు పెట్టినా తుది వరకు సీపీఐ(ఎం)లో కొనసాగిన ధన్యజీవి సామ్యానాయక్ అని కొనియాడారు. కేవల్ నర్సింహారావు, ఏలూరి లక్ష్మినారాయణ శిష్యరికంలో ముక్కుసూటిగా ప్రజాసమస్యలపై పోరాడిని నేత అని అన్నారు. మాణిక్యారం సొసైటీ చైర్మన్‌గా 1995, 2000వ సంవత్సరాలలో రెండుసార్లు, 2000సంవత్సరంలో జిల్లా డైరెక్టర్‌గా సీపీఐ(ఎం) తరుపున ఎన్నికై నీతి నిజాయితీతో రైతులకు రుణాలు అందించి సేవ చేశారన్నారు. జనం కోసం పని చేసిన నాయకుడు కాబట్టే ఆయన జీవించి



ఉండగానే ఆయన ఉన్న ఊరు సామ్యాతండాగా మారిందన్నారు. వైరా డివిజన్ కార్యదర్శి భూక్యా వీరభద్రం మాట్లడుతూ వృద్ధాప్యంలోను పార్టీ అభివృద్ధి, గెలుపుకు పనిచేశారని అసెంబ్లీ ఎన్నికలలో తన గెలుపు కు భార్యభర్తలు ఉత్సాహంగా ప్రచారం చేశారని గుర్తుచేశారు. పేదల కోసం నిస్వార్థంగా పని చేశారని, వారు చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతారన్నారు.డప్పు వాయిద్యాలు డిజెసాంగ్ పార్టీ జెండాలతో జోహార్ సామ్య నాయక్ ఆశయం సాధిస్తామంటూ గ్రామ పురవీధులు అంతిమయాత్ర కొనసాగించి ప్రజలంతా కడసారి కన్నీటి వీడ్కోలు పలికారు .ఈకార్యక్రమంలో సీపీఐ(ఎం) జిల్లా కమిటీ సభ్యులు దుగ్గి కృష్ణ, మెరుగు సత్యనారాయణ, కొండెబోయిన నాగేశ్వరరావు, మండల నాయకులు వజ్జా రామారావు, బానోత్ బన్సీలాల్, దాసరి మల్లయ్య, బాదావత్ శ్రీను, వాంకుడోత్ బాబా, సొసైటి ఉపాధ్యక్షులు దారావత్ మంగీలాల్, మాజీ జడ్పీటీసీలు వాంకుడోత్ జగన్, బానోత్ దేవ్లానాయక్, ఆత్మ కమిటీ మాజీ చైర్మన్ ముత్యాల సత్యనారాయణ, సొసైటీ డైరక్టర్ బానోత్ హీరాలాల్, మాజీ డైరక్టర్లు వాంకుడోతు భద్యానాయక్, నాగండ్ల జానకిరామారావు, కాంగ్రెస్ నాయకులు వాంకుడోత్ గాంధీ, ఆలోత్ నందరాజ్, వీర్యానాయక్, మాస్ లైన్ జిల్లా నాయకులు గుగులోత్ తేజ్యానాయక్, దారావత్ సక్రు తదితరులు పాల్గొన్నారు.

# కాకరవాయి యాదవ సంఘం కమిటీ ఎన్నిక.

-గ్రామ అధ్యక్షుడిగా బోర లింగయ్య యాదవ్, ఉపాధ్యక్షుడిగా గుండాల వెంకన్న యాదవ్.




**తిరుమలాయపాలెం, జనవరి 15, ప్రజాజ్యోతి :**

తిరుమలాయపాలెం మండలం కాకరవాయి గ్రామంలో ఐదు సంవత్సరాలకు ఒకసారి జరిగే చౌడమ్మ యాదవ సంఘం సమన్వయ సమితి ఆధ్వర్యంలో జరిగిన కాకరవాయి గ్రామ అధ్యక్షుడిగా బోర లింగయ్య యాదవ్, ఉపాధ్యక్షుడిగా గుండాల వెంకన్న యాదవ్ ను ఏకగ్రీవం గా ఎన్నుకున్నారు. బుధవారం కాకరవాయి గ్రామంలోని స్థానిక పశువుల ఆసుపత్రి ఆవరణంలో నిర్వహించిన సభలో యాదవ సంఘం విస్తృతస్థాయి సమావేశంలో వీరిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన బోర లింగయ్య యాదవ్ మాట్లాడుతూ.. గ్రామ స్థాయిలో యాదవ సంఘం అభివృద్ధికి కృషి చేస్తానని, యాదవులని ఒకే తాటిపైకి తెచ్చి వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని చెప్పారు. కాకరవాయి గొర్ల పెంపకదారుల సహకార సంఘం అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో గుండెబోయిన రామకృష్ణ యాదవ్, దండ లింగయ్య యాదవ్, వీరబోయిన దేవేందర్ యాదవ్, వీరబోయిన శ్రీనివాస్ యాదవ్, గుండెబోయిన ఎర్రయ్య యాదవ్, వీరపైన నాగలింగం యాదవ్, వీరబోయిన గంగయ్య యాదవ్, వీరబోయిన గణేష్ యాదవ్, వీరబోయిన వెంకన్న యాదవ్, గుండెబోయిన ముత్తయ్య యాదవ్, పచ్చిపాల నాగయ్య యాదవ్, వీరబోయిన రాజు యాదవ్, వీరబోయిన నాగేష్ యాదవ్, సతీష్ యాదవ్, గుండాల వెంకన్న యాదవ్ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో ఎన్నుకోవడం జరిగింది. అనంతరం వారు తెలంగాణ రైతాంగ పోరాట మొట్టమొదటి సమరయోధుడు దొడ్డి కొమరయ్య భవనం, విగ్రహ ప్రతిష్టాపన గురించి చర్చించుకున్నారు. ఈ విషయాన్ని ప్రభుత్వ అధికారుల దృష్టికి తీసుకెళ్లడం జరిగింది.

# డి.వై.యఫ్.ఐ,యస్.యఫ్.ఐ ఆధ్వర్యంలో ఘనంగా ప్రారంభమైన మండల స్థాయి వాలీబాల్ టోర్నమెంట్.





**రఘునాథపాలెం ప్రజా జ్యోతి**

సంక్రాంతి పండుగ సందర్భంగా స్థానిక చి గ్రామంలో డి.వై.యఫ్.ఐ,యస్.యఫ్. గ్రామ కమిటీల ఆధ్వర్యంలో దాతల సహకారంతో మండల స్థాయి వాలీబాల్ టోర్నమెంట్ ను నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిదులుగా సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు యర్ర.శ్రీకాంత్, ఖమ్మం డివిజన్ కార్యదర్శి వై.విక్రమ్ లు అతిధులుగా డి.వై.యఫ్.ఐ,యస్.యఫ్.ఐ జిల్లా కార్యదర్సులు షేక్.బసీరుద్దీన్,టీ.ప్రవీణ్,రాష్ట్ర కమిటీ సభ్యులు చింతల.రమేష్,గ్రామ పెద్దలు హాజరై క్రీడాకారులను పరిచయం చేసుకోనీ వాలీబాల్ టోర్నమెంట్ నీ ప్రారంభించడం జరిగింది. ఈ సందర్భంగా జరిగిన సభలో వారు మాట్లాడుతూ. నేడు క్రీడలతోనే ప్రజలందరికీ మానసిక ఉల్లాసం కలుగుతుందని,నేడు సమాజంలో క్రీడలకు చాలా ప్రాధాన్యత పెరుగుతుందని అన్నారు. నేటి యువత పెడధోరనులకు గురికాకుండా క్రీడలో రాణిస్తూ అన్ని అవకాశాలను అందిపుచ్చుకోవాలని, పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా డి.వై.యఫ్.ఐ రాష్ట్ర కమిటీ సభ్యులు చింతల.రమేష్,సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు దుగ్గి.కృష్ణ లు మాట్లాడుతూ నేటి యువత టెక్నాలజీ యుగంలో ఆన్లైన్ క్రీడలకు ఆకర్షితులై శారీరక మానసిక ఉల్లాసాన్ని కోల్పోతున్నారని,ఫ్రిపేర్ లాంటి ప్రమాదకర క్రీడలు ఆడటం వల్ల అనేక అనారోగ్య సమస్యలు తెచ్చుకుంటు ఆ యసనంతో ప్రపంచానికి దూరమై పోతున్నారని వారు అన్నారు. నేటి యువత చెడు అలవాట్లకు, పెడ ధోరణులకు లోనుకాకుండా క్రీడలలో రాణించాలని,నేటి యువత మత్తు పదార్థాలకు,ఆన్లైన్ క్రీడలకు బానిసలుగా మారకుండా క్రీడలో రాణించాలని గ్రామీణ క్రీడలకు పూర్వవైభవం తీసుకొచ్చేల ప్రభుత్వాలు కృషి చేయాలని వారు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ గ్రామ అధ్యక్షుడు జోనెబోయిన.పాపయ్య,సీపీఐగ్రామ శాఖ కార్యదర్శి ప్రొద్దుటూరి.వెంకట్ రెడ్డి,కాంగ్రెస్ కిసాన్ సెల్ నాయకుడు నర్సిరెడ్డి,జనసేన మండల అధ్యక్షుడు ప్రవంత్ ఖన్నా,యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు గోవర్ధన్,కాంగ్రెస్ నాయకులు తూము.సత్యనారాయణ,బోడపట్ల.శ్రీను,డి.వై.యఫ్.ఐ,యస్.యఫ్.ఐ గ్రామ,మండల నాయకులు గణేష్,వీరబాబు,వినోద్,నవీన్,నఫీర్,సమీర్,సురేష్,వినయ్ తదితరులు పాల్గొన్నారు.

# కుర్నవల్లిలో మాజీమంత్రి సంభాని జన్మదిన వేడుకలు..

**తల్లాడ, జనవరి 15(ప్రజా జ్యోతి న్యూస్):**

ఆర్థిక సంబంధాలతో కూడుకున్న నేటి రాజకీయ వ్యవస్థలో నిస్వార్థ,నిరాడంబర నాయకుడు సంభాని చంద్రశేఖర్ మాత్రమే అని ఆయన అభిమాని అయిలూరి వెంకట చలపతి రెడ్డి అన్నారు. మంగళవారం మాజీ మంత్రి సంభాని చంద్రశేఖర్ జన్మదిన వేడుకలను మండల పరిధిలోని కుర్నవల్లి గ్రామంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చలపతి రెడ్డి మాట్లాడుతూ 1983లో పాలేరు నియోజకవర్గ నుంచి కాంగ్రెస్ పార్టీ ద్వారా రాజకీయ రంగ ప్రవేశం చేసిన చంద్రశేఖర్ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో నాలుగు సార్లు ఎమ్మెల్యేగా, రెండుసార్లు మంత్రిగా,పిసిసి వైస్ ప్రెసిడెంట్ గా కొనసాగాడని తెలియజేశాడు. ఉమ్మడి రాష్ట్రంలో వైద్యారోగ్య శాఖ మంత్రిగా కొనసాగిన ఆయన ఎప్పుడు హంగు,ఆర్భాటాలకు తావివ్వలేదని,ఆది నుంచి కష్టపడ్డ ప్రతి కార్యకర్తకు పార్టీలో సముచిత స్థానం కల్పించాడని ఆయనకు గుర్తు చేశాడు. అనంతరం అభిమానుల సమక్షంలో కేక్ కట్ చేసి,మిఠాయిలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో అయిలూరి రామశేసిరెడ్డి,సామ్రాట్ రెడ్డి,గుర్రాళ్ళ గోపాలకృష్ణ రెడ్డి అభిమానులు పాల్గొన్నారు.



# మార్కెట్లో దళారీ వ్యవస్థను అరికట్టాలి న్యూడెమోక్రసీ

-రైతాంగానికి గిట్టుబాటు, మద్దతు ధర అందించాలి

-రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు న్యూడెమోక్రసీ నేత ఆవునురి మధు



**తిరుమలయపాలెం, జనవరి 15, ప్రజాజ్యోతి :**

తిరుమలాయపాలెం మండలం కాకరవాయి గ్రామంలో సిపిఐ, ఎమ్మెల్, న్యూ డెమోక్రసీ మండల ముఖ్య కార్యకర్తల జనరల్ బాడీ బుధవారం జరిగింది ఈ జనరల్ బాడీని ఉద్దేశించి న్యూ డెమోక్రసీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఆవునురి మధు పాల్గొని మాట్లాడుతూ... రైతాంగానికి ఇచ్చిన ఉచిత వాగ్దానాలు కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయలేదని, వారికి మద్దతు ధర ఇవ్వకుండా బోనస్ పేరుతో రైతాంగాన్ని మోసం చేసిందని, మరోపక్క మిర్చి పత్తికి గిట్టుబాటు ధర కల్పించకుండా రైతుల పాలిట శాపంగా ప్రభుత్వం మారిందని వారు అన్నారు మార్కెట్లో రైతాంగాన్ని దోపిడీ చేస్తున్నారని, దళారీ వ్యవస్థను అరికట్టాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు కమిషన్ల పేరుతో రైతుల దగ్గర దళారులు దోసుకుంటున్నారని వారు అన్నారు. రైతాంగానికి ఇచ్చిన ఉచిత వాగ్దానాలు అమలు చేయకపోతే రైతుల పక్షాన సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ పోరాడుతుందని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ ఖమ్మం జిల్లా కార్యదర్శి మందుల రాజేంద్రప్రసాద్, డివిజన్ కార్యదర్శి బజ్జూరి వెంకటరామిరెడ్డి, జిల్లా నాయకుడు విప్లవ కుమార్, ఐ వెంకన్న, గొర్రెపాటి వీరస్వామి, గడ్డం శ్రీనివాసరెడ్డి, వెంకటేశ్వర్లు, అచ్చా ఉప్పలయ్య, విజయ్, బ్రహ్మచారి, పట్టాభి, షబ్బీర్ మల్సూరు తదితరులు పాల్గొన్నారు.

# జీకే బంజరలో ఆకట్టుకున్న ముగ్గులు

-బహుమతులు ప్రదానం చేసిన ఆదిలాబాద్ జడ్జి భూక్య హుస్సేన్




**రఘునాథపాలెం ప్రజా జ్యోతి**

జీకే బంజర గ్రామంలో ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ పిన్ని కోటేశ్వరరావు ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆదిలాబాద్ జడ్జి భూక్య హుస్సేన్ మాట్లాడుతూ.. పండుగలు ఐక్యతను పెంచుతాయని అన్నారు. ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం చాలా ఆనందంగా ఉందని అన్నారు. మహిళా సమస్యలను కళ్లకు కట్టినట్టుగా ముగ్గు వేసిన యువతిని అభినందించి, ప్రత్యేక బహుమతి అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ వైస్ సర్పంచ్ బాణోత్ శ్రీను, గ్రామ శాఖ అధ్యక్షులు టీఆర్ఎస్ పార్టీ బోడ శ్రీను, మాలోతు వీరన్న, కృష్ణ, బాణోత్ బావసింగ్, మాలోత్ డేవిడ్ రాజ్. ఇనపాల మల్లయ్య, పిన్ని భద్రయ్య, బానోత్ వీరబాబు, భారత్ కృష్ణ, వేముల ఉపేందర్, రామకృష్ణ, భాష, బానోతు సరేష్, సురేష్, భూక్య బాలాజీ, బానోత్ రామారావు, బాదావత్ రవి, బానోత్ రవి, బానోతు శ్రీను, కొంగర శ్రీనివాసరావు, గ్రామ ప్రజలు మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. మొదటి బహుమతీ, ద్వితీయ, తృతీయ బహుమతులు బానోత్ శాలు, బోడ శైలు, బానోత్ సత్య అందుకున్నారు.

# ఇంటి ముందు లక్ష్మీ కళ రావాలంటే ముగ్గు ఉండాలి



జనవరి 15(ప్రజా జ్యోతి):

ప్రతి ఇంటి ముందు లక్ష్మీ కళ రావాలంటే ఆ ఇంటి ముందు ఒక ముగ్గు ఉండాలి అని టిఆర్ఎస్ జిల్లా నాయకులు గండూరి కృపాకర్ అన్నారు. మంగళవారం సూర్యాపేట జిల్లా కేంద్రం 45వ వార్డులో ఇంటికి ఒక ముగ్గు కార్యక్రమంలో వారు పాల్గొని మాట్లాడారు సనాతన సాంప్రదాయాల్లో ఇంటిముందు ముగ్గులు వేయడం ఒక కళ, ఇంటి ముందు ముగ్గు ఉంటే ఆ కుటుంబంలో సుఖశాంతులు సంపద కలుగుతుంది అని అన్నారు. సంక్రాంతి పండుగ సంబరాలు ప్రతి ఇంటిలో ఉండాలని మహిళలు అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించాలని అన్నారు. అనంతరం ప్రతి ఇంటి ముందు ముగ్గును న్యాయ నిర్ణెతల చేత ఎంపిక చేసి ఇంటింటికి ఒక సర్ ప్రైజ్ గిఫ్ట్ తో పాటు, విజేతలకు బహుమతులు ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో వార్డు ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# వాసవి క్లబ్ అధ్వర్యంలో జాతీయ సైనిక దినోత్సవం



జనవరి 15(ప్రజా జ్యోతి):

జాతీయ సైనిక దినోత్సవంను పురస్కరించుకొని సూర్యాపేట జిల్లా కేంద్రంలోని కల్నల్ సంతోష్ బాబు విగ్రహం వద్ద వాసవి క్లబ్ అధ్యక్షులు మంచాల శ్రీనివాస్ ఆధ్వర్యంలో చైనా ముష్కర్ల దాడిలో అమరుడైన కల్నల్ సంతోష్ బాబు విగ్రహానికి పూలమాలు వేస్తే నివాళులర్పించడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తన ప్రాణాలను సైతం లెక్కచేయక దేశ సరిహద్దుల్లో విదేశీ శక్తుల నుండి మనను కాపాడుతున్న సైనికుల రుణం తీర్చుకోలేనిదని కొనియాడారు. కార్యక్రమంలో సింగిరి కొండ రవీందర్ డిస్టిక్ క్యాబినెట్ సెక్రటరీ బికుమల్ల కృష్ణ ట్రెజరర్ శబరినాథ్ ఐపీసీ ఆఫీసర్స్ గుండా శ్రీధర్ తల్లాడ సోమయ్య గ పబ్బతి ప్రవీణ్ డిస్టిక్ ఇన్చార్జెస్ కలకోట లక్ష్మయ్య వాసవి క్లబ్ జెడ్ సి చల్లా లక్ష్మయ్య డిస్టిక్ చైర్మన్ తల్లాడ కృష్ణమూర్తి వాసవి క్లబ్ సెక్రటరీ మా శెట్టి నరేష్, రిటైర్డ్ సైనికులు వాసవి మెంబర్లు పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# సంక్రాంతి ముగ్గుల పోటీలు





- మన సంస్కృతి,సంప్రదాయాలకు ప్రతీక

-సంగం వెంకట పుల్లయ్య మోటర్ వెహికల్స్ ఇన్స్పెక్టర్

కల్లూరు జనవరి 15(ప్రజా జ్యోతి):


మండల పరిధిలోని బోడిమల్లి గ్రామంలో సంక్రాంతి పండుగ సందర్భంగా సంగం శంభయ్య,తిరుపతమ్మ జ్ఞాపకార్థం వారి కుమారులు మల్లయ్య, వెంకట పుల్లయ్య ఆధ్వర్యంలో మంగళవారం ముగ్గుల పోటీలు ఘనంగా నిర్వహించబడ్డాయి.ఈ పోటీలు ఇప్పుడు 11వ సంవత్సరం జరగడం విశేషం.గ్రామస్తుల సంపూర్ణ మద్దతుతో పండుగ మరింత ఉత్సాహభరితంగా సాగింది.సంక్రాంతి శుభాకాంక్షలు తెలియజేస్తూ,ప్రతి ఒక్కరూ భోగభాగ్యాలతో సుఖసంతోషాలతో జీవించాలని ఆకాంక్షించారు.ఈ సందర్భంగా సంగం వెంకట పుల్లయ్య మాట్లాడుతూ ముగ్గులు మన సంప్రదాయాలకు ప్రతీక.ప్రతి ఏడాది మా తల్లిదండ్రుల జ్ఞాపకార్థం ఈ పోటీలు నిర్వహించడం మా కుటుంబానికి గర్వకారణం.ముగ్గుల ద్వారా గ్రామీణ ప్రాంతాల సంస్కృతి,సంప్రదాయాలను ప్రోత్సహించడం,తద్వారా కొత్త తరాలకు పరిచయం చేయడం మా ప్రధాన లక్ష్యం అని అన్నారు. ఉపాధ్యాయునిలు నాగమణి,సుజాత న్యాయనిర్ణేతలుగా వ్యవహరించారు.ముగ్గుల అందం, సృజనాత్మకత,నైపుణ్యం వంటి అంశాలను వారు ఎంతో మెచ్చుకున్నారు.పోటీల్లో మొత్తం 53 మంది పాల్గొన్నారు.ప్రతిభ కనబరిచిన మొదటి బహుమతి డి సంధ్య,రెండవ బహుమతి శీలం స్రవంతి మూడవ బహుమతి రజిత లకు అందించగా పాల్గొన్న ప్రతి ఒక్కరికీ ప్రోత్సాహక బహుమతులు అందజేయడం జరిగింది.రోడ్డు భద్రతపై సంగం వెంకట పుల్లయ్య రోడ్డు ప్రమాదాలపై అవగాహన కల్పిస్తూ, తాము చూసిన సంఘటనలతో పాటు,గ్రామంలోని



అనుభవాలను కూడా ప్రస్తావించారు.రోడ్డు భద్రతకు సంబంధించిన జాగ్రత్తలు పాటించడం వల్ల ఎన్నో ప్రాణాలను కాపాడవచ్చుని తెలిపారు.అలాంటి ప్రమాదాలను నివారించడం మనందరి బాధ్యత అని ఆయన పేర్కొన్నారు.ఇలాంటి కార్యక్రమాలు గ్రామీణ అనుబంధాన్ని బలపరుస్తాయని పండగ ఉత్సవాల ద్వారా పిల్లల నుండి పెద్దల వరకు అందరూ ఒక్కటిగా ఉంటూ సామాజిక విలువలను పెంపొందించుకోవడం చాలా ముఖ్యమైన అంశం అని పలువురు అభినందించారు.ఈ కార్యక్రమంలో సంగం మల్లయ్య,దమయంతి, రమేష్,రఘు రామ్,శీలం వీరభద్రా రెడ్డి,రామభద్రా రెడ్డి,సంగం రామకృష్ణ,శ్రీలక్ష్మి,నవీన్,రాయల నారాయణ,మమత టీచర్ తదితరులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# పాపటపల్లిలో ఘనంగా ముగ్గుల పోటీలు..





-విజేతలకు బహుమతులు

ప్రజా జ్యోతి రఘునాధపాలెం




పాపటపల్లి గ్రామంలో సంక్రాంతి పండగ సందర్భంగా.. మహిళలకు ముగ్గుల పోటీలు దాతల సహకారం తో నిర్వహించారు. జర్నలిస్ట్ గోపి, గ్రామ పెద్దల ఆధ్వర్యంలో మంగళవారం జరిగిన ముగ్గుల పోటీల్లో మహిళలు ఉత్సాహంగా పాల్గొన్నారు. సంస్కృతి సంప్రదాయాల పరిరక్షణకు ఇలాంటి పోటీలు ఎంతో ఉపయుక్తమని, ఈ రంగురంగుల ముగ్గులు పండుగ వాతావరణం, ముత్యాల ము గ్గులు కళలలకు నిలయాలని, ముగ్గులు మహిళల్లో ఉండే ప్రతిభను వెలికి తీస్తాయన్నారు. సంక్రాంతి పండుగ రోజున మహిళందరూ కలిసి ముత్యాల ము గ్గుల పోటీల్లో పాల్గొని రంగు రంగుల ముగ్గులు వేయడం చాలా సంతోషంగా ఉందన్నారు.గోపి జర్నలిస్ట్ అన్నారు. అనంతరం ముగ్గుల పోటీల్లో గెలుపొందిన విజేతలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులను కాముని నాగేశ్వరరావు, సచ్చు లక్ష్మీనారాయణ, గ్రామ పెద్దలు అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

# తల్లాడ మండలంలో ఘనంగా సంక్రాంతి వేడుకలు..





-ఐద్వా ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు..

తల్లాడ, జనవరి 15 (ప్రజా జ్యోతి న్యూస్):

చిన్నారులకు సెలవుల సంబరం,ముగ్గుల్లో ఒదిగిపోయే పల్లెపడుచుల నాజూకు తనం,దాన్య రాశులతో పుష్య లక్ష్మి కళ, పిండి వంటల గుమగుమలు, అల్లుళ్ల వైభోగం,యువకుల కోలాహలం,కళాకారుల ప్రదర్శన..హరిదాసుల సంకీర్తన,అంబరాన ఎగిరే పతంగం,కత్తులు దూసే కోడిపుంజులు ఇవన్నీ కలగలపి పల్లె"టూరు"కు పయనం అయ్యే పట్నంతో సరదాగా సంతోషంగా తెలుగు వారు చేసుకునే అతి పెద్ద పండుగ సంక్రాంతి ఐద్వా ఆధ్వర్యంలో సంక్రాంతి పండుగ సందర్భంగా మండల పరిధిలోని కుర్నవల్లి గ్రామంలో ఐద్వా ఆధ్వర్యంలో ముగ్గుల ఫోటోలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రాష్ట్ర మహిళా సంఘ సభ్యురాలు శీలం పకీరమ్మ పాల్గొని మాట్లాడుతూ ఇలపై ఇంద్రధనస్సులు విరిసినట్లు, నింగిలోని చుక్కలన్ని నేలపై వాలినట్టు రంగురంగుల రంగవల్లికలు ఆకట్టుకున్నాయని ఆమె అన్నారు.మహిళలు ఉదయం పూట ఇళ్ళ ముందు ముగ్గులు వేయడం మంచి వ్యాయామమన్నారు. దీంతోపాటు మహిళల్లో సృజనాత్మకత పెరుగుతుందన్నారు.ముగ్గుల పోటీలు ఐక్యతకు,ఆప్యాయతకు నిదర్శనమన్నారు.సంక్రాంతి పండుగ ప్రకృతి పండుగ అని తెలిపారు.సాంస్కృతిక అంశాలు మానసిక వికాసానికి,శారీరక ఆరోగ్యానికి,ఏకాగ్రతకు ఎంతగానో దోహదపడుతాయని తెలియజేశారు. అనంతరం విజేతలకు బహుమతి ప్రధానోత్సవం జరిగింది.ఈ కార్యక్రమంలో మహిళా సంఘం మండల అధ్యక్షురాలు స్వరూప,రైతు సంఘం జిల్లా నాయకులు శీలం సత్యనారాయణ రెడ్డి,అయినాల రామలింగేశ్వర రావు,కట్టా దుర్గారావు,వ్యవసాయ కార్మిక సంఘం నాయకుడు దుళ్ల జనార్ధన్, సిఐటియు నాయకులు కట్టా నిర్మల,లక్ష్మి, బహుమతి ప్రదాతలు శీలం సిద్ధారెడ్డి,ఫకీరమ్మ,కోటిరెడ్డి, వెంకట చలపతి రెడ్డి,సామ్రాట్ రెడ్డి,రామశేశిరెడ్డి అధిక సంఖ్యలో మహిళలు గ్రామస్తులు పాల్గొన్నారు.

## వేముల అక్కమ్మకు నివాళులర్పించిన మారెళ్ళ మల్లిఖార్జున్ రావు..



తల్లాడ, జనవరి 15 (ప్రజాజ్యోతి న్యూస్):

తల్లాడ మండలంలోని అన్నారుగూడెం గ్రామానికి చెందిన వేముల అక్కమ్మ ఇటీవల మృతి చెందారు. బుధవారం ఆమె దశదిన కర్మ గ్రామంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి గ్రామ అభివృద్ధి కమిటీ మాజీ చైర్మన్ మారెళ్ళ మల్లికార్జునరావు, సొసైటీ డైరెక్టర్ గోవిందు శ్రీనివాస్ రావు, మాజీ ఎంపీటీసీ తాళ్ల జోసెఫ్ హాజరై ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సంతాప సానుభూతిని వ్యక్తం చేశారు. నివాళులర్పించిన వారిలో స్థానిక నాయకులు గుమ్మ వలరాజు స్థానికులు బసవయ్య, వేముల కుటుంబ సభ్యులు ఉన్నారు.

## రాగూర్ లో పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం..



తల్లాడ(వైరా), జనవరి 15 (ప్రజాజ్యోతి న్యూస్):

స్థానిక ఠాగూర్ విద్యాలయంలో 2013-14 సంవత్సరం లో పదవ తరగతి పూర్తి చేసిన విద్యార్థులు ఆత్మీయ సమ్మేళన కార్యక్రమం నిర్వహించారు. వివిధ ప్రాంతాలలో స్థిర పడిన విద్యార్థులందరు కలిసి తాము చదువుకున్న రోజులలోని తీపి జ్ఞాపకాలు గుర్తు చేసుకున్నారు. కరస్పాండెంట్ సంక్రాంతి రవి కుమార్ మాట్లాడుతూ విద్యార్థులు అందరూ ఉన్నత స్థాయి కి చేరుకోవాలని ఆకాంక్షించారు. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమం లో చైర్మన్ వాసిరెడ్డి సునీత, డైరెక్టర్ సంయోగిత ఆనాటి ఉపాధ్యాయులు రామకృష్ణ, మజీద్, రాంబాబు, పూర్వ విద్యార్థులు పవన్, హరిబాబు, రాకేష్, భార్గవ్, ఉమ, ఉమా సంధ్య, సరిత, ఉషారాణి , శ్రీలేఖ,సతీష్ తదితరులు పాల్గొన్నారు.

## మార్కెట్‌లో షార్ట్ సర్క్యూట్‌పై మంత్రి తుమ్మల ఆరా

-తక్షణమే అధికార యంత్రాంగం సంఘటన స్థలానికి చేరుకోవాలని ఆదేశం

ఖమ్మం ప్రతినిధి ప్రజా జ్యోతి



ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌లో బుధవారం రాత్రి జరిగిన విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌పై మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆరా తీశారు. ఖమ్మం మార్కెట్‌లో వ్యాపారులకు చెందిన పత్తి బస్తాలు షార్ట్ సర్క్యూట్‌తో ధగ్ధం కాగా... సంఘటన విషయం తెలిసిన మంత్రి తుమ్మల గారు అధికార యంత్రాంగాన్ని సంఘటన స్థలానికి చేరుకోవాలని ఆదేశించారు.పోలీస్ కమిషనర్ సునీల్‌దత్‌తో మాట్లాడటంతో ఇతర అధికార యంత్రాంగాన్ని సైతం అప్రమత్తం చేశారు. మార్కెటింగ్, ఫైర్, పోలీస్ అధికారులు సంఘటన స్థలానికి వెళ్ళిన పూర్తి వివరాలు సేకరించే పనిలో నిమగ్నమయ్యారు. ఈ విషయంమై నూతనంగా వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ఎన్నికైన యరగర్ల హన్మంతరావు, వైస్‌చైర్మన్ తల్లాడ రమేష్‌లను సైతం మార్కెట్‌ను సందర్శించాలని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదేశించారు.సంఘటనపై ఆరా తీయండి మార్కెట్‌లో జరిగిన సంఘటన ఏ విధంగా జరిగింది.. ఏ సమయంలో జరిగింది.. ఇందుకు గల కారణాలను సైతం క్షుణ్ణంగా తెలుసుకోవాలని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు గాఉ ఆదేశించారు. సెలవు రోజుల్లో ఈ సంఘటన జరగటంపై సుధీర్ఘంగా వివరాలు సేకరించి నివేదిక ఇవ్వాలని అధికార యంత్రాంగాన్ని ఆదేశించారు.

# ప్రతీక, స్మృతి మంధాన సెంచరీలు

-ఐర్లాండ్‌పై 304 పరుగుల తేడాతో గెలుపు రికార్డు

-వన్డే సిరీస్ 3-0తో భారత్ క్లీన్‌స్వీప్




జనవరి 15(ప్రజా జ్యోతి):

భారత మహిళల జట్టు వన్డేల్లో సరికొత్త రికార్డుల నమోదు చేసింది. రాజ్‌కోట్ వేదికగా ఐర్లాండ్‌తో బుధవారం జరిగిన మూడో, చివరి వన్డేలో అత్యధిక స్కోర్ నమోదు చేయడంతోపాటు, అత్యధిక పరుగుల తేడాతో గెలిచిన జట్టుగా రికార్డు నెలకొల్పింది. తొలుత బ్యాటింగ్‌కు దిగిన 50 ఓవర్లలో 5వికెట్ల నష్టానికి 435పరుగులు చేసింది. వన్డే క్రికెట్ చరిత్రలో టీమిండియా మహిళల జట్టుకు ఇదే అత్యధిక స్కోర్. అలాగే ఐర్లాండ్‌పై 304పరుగుల భారీ తేడాతో భారత మహిళల జట్టు విజయం సాధించడం కూడా ఇదే తొలిసారి. ఈ గెలుపుతో మూడు వన్డేల సిరీస్‌ను స్మృతి మంధాన సేన 3-0తో చేజిక్కించుకొని క్లీన్‌స్వీప్ చేసింది. 2017లో ఐర్లాండ్‌పైనే భారత మహిళల జట్టు 249 తేడాతో నెగ్గింది. తాజాగా ఆ రికార్డును బ్రేక్ చేసింది. టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగిన టీమిండియాను ఓపెనర్లు మంధాన, ప్రతీకా రావల్ సెంచరీలతో చెలరేగారు. వీరిద్దరూ తొలి వికెట్‌కు 233 పరుగులు జోడించారు. మంధాన వన్డేల్లో ఫాస్టెస్ట్ సెంచరీ నమోదు చేసింది. 70 బంతుల్లో సెంచరీ కొట్టింది. ఓవరాల్‌గా 80 బంతుల్లో 12ఫోర్లు, 7సిక్సర్ల సాయంతో 135 పరుగులు చేసింది. మరో ఓపెనర్ ప్రతీకా రావల్.. వన్డేల్లో తొలి సెంచరీ. ఆమె 129 బంతుల్లో 20ఫోర్లు, ఒక సిక్సర్ సాయంతో 154పరుగులు చేసింది. ఆ తర్వాత ధాటిగా ఆడే క్రమంలో రీచా ఘోష్(59) అర్ధసెంచరీతో మెరిసినా.. తేజల్(28), హర్లిన్(15) త్వరగా పెవీలియన్‌కు చేరారు. దీంతో టీమిండియా 50 ఓవర్లలో 5వికెట్ల నష్టానికి 435పరుగుల రికార్డు స్కోర్‌ను నమోదు చేసింది. ఐర్లాండ్ బౌలర్లు ప్రెండెర్‌గ్యాస్ట్ రెండు, కెల్లె, సర్జెంట్, డెంసే ఒక్కో వికెట్ పడగొట్టారు.

పదో సెంచరీ.. అత్యంత వేగంగా..

తొలి బంతి నుంచే దూకుడుగా ఆడిన స్మృతి మంధాన కెరీర్‌లో పదో సెంచరీని పూర్తి చేసుకుంది. ఈ క్రమంలో భారత్ తరఫున అత్యంత వేగవంతమైన శతకం బాదిన బ్యాటర్‌గా నిలిచింది. కేవలం 70 బంతుల్లోనే ఈ మార్క్‌ను అందుకొంది. మరోవైపు ప్రతీకా రావల్ తొలి సెంచరీని 100 బంతుల్లో సాధించింది. తొలి వికెట్‌కు మంధాన-ప్రతీకా రావల్ జోడీ 233 పరుగులు రాబట్టారు. మహిళల వన్డే చరిత్రలో ఆరో అత్యధిక ఓపెనింగ్ భాగస్వామ్యంగా నిలిచింది.

భారీ లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో ఐర్లాండ్‌ను భారత బౌలర్లు కట్టడి చేశారు. దీప్తి శర్మ(3/27), తనూజ(2/31)కి తోడు టిటాస్ సద్ధు, సయాలి, మిన్ను మణి ఒక్కో వికెట్‌తో రాణించారు. ఐర్లాండ్ ఓపెనర్ ఫ్రోబెస్(43), ప్రెండెర్‌గ్యాస్ట్(36) టాప్‌స్కోరర్స్. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్, సిరీస్ ప్రతికా రావల్‌కు దక్కాయి.

